క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ధర్మసాగర్ : రోడ్డు ప్రమాదంలో యువకుడు మరణించాడు. ఈ సంఘటన మండలంలోని కరుణాపురం జాతీయ రహదారిపై మంగళ వారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండ లం మునిపల్లికి చెందిన ఎస్‌డి. కరీం (30) మంగళవారం వివిధ పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై స్టేషన్ ఘన్‌పూర్‌కు వెళ్లాడు. పను లు ముగించుకుని రాత్రి తిరిగి వస్తున్న క్రమం లో కరుణాపురంలోని డీపీఎస్ దగ్గర ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు విడి చాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

తెరుచుకున్న దర్గా రైల్వే గేట్

కాజీపేట రూరల్: కాజీపేట దర్గా రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్‌ను రైల్వే అధికారులు బుధవారం తెరిశారు. దర్గా రైల్వే గేట్ మీదుగా కాజీపేట – వరంగల్ సెక్షన్ల మధ్య మూడవ రైల్వే లైన్ నిర్మాణం కారణంగా దర్గా రైల్వే గేట్‌ను వారం రోజుల పాటు మూసివేశారు. మూడవ రైలు మార్గం నిర్మాణం పూర్తి కావడంతో బుధవారం నుంచి యధావిధిగా వాహన రాకపోకలకు అనుమతించినట్లు అధికారులు వివరించారు.

ఆర్టీసీ ఆర్‌ఎంకు సన్మానం

హన్మకొండ: ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన డి.విజయభానును నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు సన్మానించారు. హనుమకొండలోని వరంగల్ రీజియన్ కార్యాలయంలో ఆర్‌ఎంను ఎన్‌ఎంయూ వరంగల్ రీజియన్ కార్యదర్శి సీహెచ్.యాకయ్య, పలువురు నాయకులు బుధ వారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకుడు మాశం శ్రీనివాస్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. క్యాస్ట్ లీడర్‌షిప్ అండ్ పొలిటిక్స్ ఇన్ తెలంగాణ స్టేట్ – ఏ స్టడీ షెడ్యూల్డ్ క్యాస్ట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్ర ణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ హరిప్ర సాద్ పర్యవేక్షణలో శ్రీనివాస్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

వీధికుక్కల పట్టివేత

ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్ కరీమా బాద్‌లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తు న్నాయి. రహదారులపై గుంపులుగా తిష్టవేసి స్థానికులకు భయాందోళనకు గురిచేస్తున్నాయి. ప్రజల అభ్యర్థన మేరకు బల్దియా అధికారుల ఆధ్వర్యంలో వీధికుక్కలను బల్దియా సిబ్బంది పట్టుకుని సంరక్షణ కేంద్రానికి తరలించారు.

స్వయం ఉపాధితో ఎదగాలి

ఖిలా వరంగల్: యువత సమష్టిగా స్వయం ఉపాధితో ఎదుగుతూ మరో పదిమందికి ఉపా ధి చూపాలని వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నం దిరాం నాయక్ సూచించారు. వరంగల్ శంభు నిపేటలో మిర్జా వసీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోజన హోటల్‌ను ఈద్గా ప్రతినిధి జబ్బార్, ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, ఉర్సు దర్గా పీఠాధిపతులు ఉబేద్ బాబా, నవీద్ బాబాతో కలిసి ఏసీపీ బుధవారం ప్రారంభించి మాట్లా డారు. హస్సన్ అలీబేగ్, రఫిక్, సీహెచ్ యాద గిరి, మసూద్, మాషూక్ పాల్గొన్నారు.

వృత్తి శిక్షణలో రాణించాలి

ఖిలా వరంగల్: నిరుపేద మహిళలు వృత్తి శిక్ష ణలో రాణించాలని స్థానిక కార్పొరేటర్ పోశాల పద్మ సూచించారు. వరంగల్ 41వ డివిజన్ ఉర్సు కరీమాబాద్‌లో అల్ రోష్ని సంక్షేమ సం ఘం ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణను పూర్తిచేసిన మహిళలకు బుధవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపా ధి మార్గాన్ని చూపాలనే ఆలోచనతో 45 రోజుల పాటు టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణ ఇప్పించడం అభినందనీయమని కొనియా డారు. కార్యక్రమంలో డాక్టర్ పరికి సుధాకర్, డాక్టర్ షరీఫ్ ఉన్నీసా, షబానా, అజ్మీ, కాంగ్రెస్ నాయకులు అందె సునీల్, షేక్ మున్వర్, తదితరులు పాల్గొన్నారు.

జీరో బిల్లులను నమోదు చేయాలి

వరంగల్: నగరంలోని విద్యుత్ జీరో బిల్లుల తోపాటు గ్యాస్ సబ్సిడీకి అర్హులైన వారిని గుర్తించేందుకు డివిజన్ల వారీగా నమోదు కార్య క్రమం చేపట్టాలని 13వ డివిజన్ కార్పొరేటర్ సురేష్‌జోషి సూచించారు. జీరో బిల్లుల నమోదు, గ్యాస్ లబ్ధిదారులను గుర్తించేందుకు నగరంలో నాలుగు ప్రాంతాల్లోనే చేపట్టడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నా రని తెలిపారు.

హైర్ బస్ ఓనర్స్ కార్యవర్గం ఎన్నిక

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ –2 డిపో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నూరు శ్రీను, కార్యదర్శిగా ఎండి ఫర్వేజ్, కోశాధికారిగా లక్కం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులను హనుమకొండలోని వరం గల్ –2 డిపోలో డిపో మేనేజర్ జి.సురేష్‌కు హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వరం గల్ రీజియన్ అధ్యక్షుడు మారెపల్లి రాంరెడ్డి బుధవారం పరిచయం చేశారు. డిపో మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు మహమ్మారిని తరిమికొట్టాలి

- డ్రగ్స్ రహిత సమాజ స్థాపనే ధ్యేయం
- పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్
- ప్రధాన కూడళ్లు, పాఠశాలల్లో అవగాహన ర్యాలీ



కమలాపూర్ : మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



పరకాల : ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ కిశోర్‌కుమార్

పరకాల : యువత, విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను నాశనం చేస్తున్న మత్తు మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టాలని పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ అన్నారు. మత్తు పదార్థాలకు వ్యతిరే ఖంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అంబేడ్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వ హించారు. ఏసీపీ మాట్లాడుతూ.. మత్తు పదార్థా లను తీసుకోవడం వలన యువత నేరాలతో పాటు పెడదారులు పట్టే ప్రమాదం ఉందన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంద న్నారు. లేకపోతే వారి భవిష్యత్ ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. పరకాల మున్సిపల్ కమిష నర్ కె.నర్సింహ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, పరకాల సీఐ రవిరాజు, ఎస్సై రమేశ్, ,అధ్యాపకులు, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మత్తురహిత సమాజ స్థాపనే పోలీస్‌శాఖ ధ్యేయంగా పనిచేస్తుందని ఎస్సై సాయిబాబు అన్నారు. బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భీమదేవరపల్లి మండల కేంద్రంతో పాటు ముల్కనూరులో మాదకద్రవ్యాల తో వచ్చే నష్టాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వ హించారు. అనంతరం డ్రగ్‌రహిత సమాజ స్థాప నకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ.. మండలంలో ఎవరైనా మత్తుప దార్థాలు, విక్రయించినా, అక్రమ రవాణా చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటివారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కొనసా గిస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కు సమా చారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యాంగా ఉంచుతామని ఆయన తెలిపారు. ఐసీడీఎస్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బం ది కెల్ఎన్ స్వామి, స్వరూప, రాణి పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మాదకద్రవ్యాలకు అలవాటు పడి యువత తమ ఆరోగ్యంతో పాటు జీవితాలను నాశనం చేసుకోవద్దని, మాదకద్రవ్యాలకు దూరం గా ఉండాలని ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య సూచిం చారు. అంతర్జాతీయ డ్రగ్స్ నిర్మూలన దినోత్స వాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎం జేపీ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో ఎన్ సీసీ టెన్త్ బెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం అవ గాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలకు అల వాటు పడిన వారు విచక్షణ కోల్పోయి ఏం చేస్తున్నా రో తెలియని పరిస్థితుల్లో అనేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని అన్నారు. డ్రగ్స్ మహమ్మారి ఎందరి జీవితాలనో చిన్నాభిన్నం చేస్తోందని ఆవే దన వ్యక్తం చేశారు. యువత చెడువైపు ప్రయాణిం చొద్దని కోరారు. ఏటీపీ రజిత, డిప్యూటీ వార్డెన్ రమేశ్, ఏఎన్ఓ విజయ్, పీఈటీలు ఒస్కుల నాగ రాజు, పాక వెంకటేష్, ఉపాధ్యాయులు రవి, పబ్బు అశోక్, శ్రావణ్, వెంకటేష్, నాగరాజు, చిరంజీవి, సతీష్, జక్కు భిక్షపతి, అబ్దుల్ రషీద్, చంటి, మల్లేశం, మోహన్, అజీమ్, భారతి, స్రవంతి, విజయ, మమత, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సీఐ క్రాంతికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో బుధవారం అంత ర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించు కుని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వాడకం నిషేధించ బడిందన్నారు. మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చ రించారు. డ్రగ్స్ విక్రయాలు జరిపే వ్యక్తుల వివ రాలను టోల్ ఫ్రీనెంబర్ 14446కు సమాచారం ఇవ్వాలని కోరారు.

శాయంపేటలో..

శాయంపేట : యువత వ్యవసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై ప్రమోద్‌కు మార్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠ శాల విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వ హించారు. డ్రగ్స్ విక్రయించే వారిపై పీడి యాక్ట్ నమోదు చేస్తున్నట్లు హెచ్చరించారు. యువకులు, ప్రజల సహకారంతో డ్రగ్స్‌ను నిర్మూలించవచ్చని, అందరూ సహకరించాలని కోరారు.

దామెరలో..

దామెర : మండలంలోని యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పరకాల రూరల్ సీఐ రంజిత్‌రావు అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని కేర్ ఫార్మసీ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించి మాట్లా డారు. ప్రస్తుత కాలంలో చాక్లెట్లు, బిస్కెట్లలో మత్తు పదార్థలు అమ్ముతున్నారని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. డిస్నీల్యాండ్ పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజే తలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్ర మంలో తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఎస్సై కొంక అశోక్, కేర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సుధీర్ కుమార్, డిస్నీల్యాండ్ పాఠశాల డైరెక్టర్లు రాకేశ్ భాను, దినేష్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : మండల కేంద్రంలోని కస్తూర్బాలో ఎస్ఓ స్రవంతి మాదకద్రవ్యాలతో వచ్చే అనర్థాలపై విద్యా ర్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన, డ్రాయింగ్‌తోపాటు వివిధ రంగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : మాట్లాడుతున్న సీఐ క్రాంతికుమార్



ఎల్కతుర్తి : ముల్కనూరులో..



శాయంపేట : మానవహారం చేస్తున్న విద్యార్థులు



దామెర : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

ఉచిత కరెంట్ మాకు వర్తించదా..?



శాయంపేట : 'రాష్ట్రంలో 200 యూనిట్ల ఉచిత కరెంట్ అమలు అవుతుంటే మాకు ఎందుకు జీరో బిల్లు రావడం లేదు. ప్రజాపాలనలో దర ఖాస్తు చేసుకున్నా జీరో బిల్లు రాలేదు. పలుమార్లు అధికారులను అడిగితే వివిధ కార ణాలు చెబుతూ దాటవేస్తున్నారు' అని బాధితు లు వాపోయారు. మండల కేంద్రానికి చెందిన బాసాని నవీన్, మామిడి జగన్నాథం ప్రజాపా లన దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కానీ జీరో కరెంట్ బిల్లు రావడంలేదని వాపోయారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ప్రజాపాలన దరఖాస్తులతో నిరసన తెలిపారు. జీరో బిల్లు ఎందుకు రావడంలేదని అధికారులను అడిగితే ఆన్‌లైన్‌లో నాట్ అప్లై అని చూపిస్తోందని తెలిపారు. ఎడిట్ ఆప్షన్ రావడంలేదని దాట వేస్తున్నారని, విద్యుత్ అధికారులు విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందిం చి ప్రజాపాలన సవరణ దరఖాస్తులను త్వరిత గతిన పూర్తి చేయాలని కోరారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

నడికూడ : మండలంలోని నార్లపూర్ గ్రామం లో గల జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన కొమరవె ల్లి ముక్తేశ్వర్ తల్లి కొమరవెల్లి వైకుంఠం-వన మాల జ్ఞాపకార్థం ఎంపీపీ మచ్చ అనసూర్య ప్లేట్లు, నోట్ బుక్స్, కంపాక్స్ బాక్సులను అం దించారు. విద్యార్థులకు చిన్నవయస్సు నుంచే చదువుపై మక్కువ పెంచాలని ఉపాధ్యాయులను ఈ సందర్భంగా కోరారు. తన తల్లి జ్ఞాపకార్థం విద్యార్థులకు సాయం అం దించడం అభినందనీయమని అన్నారు.

కేసీఆర్‌ను కలిసిన రాకేశ్

దామెర : మండల కేంద్రానికి చెందిన టీఆర్ ఎస్వీ మండల అధ్యక్షుడు మంతుర్తి రాకేశ్ బుధ వారం మాజీ సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వ కంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన విద్యా విధానం

- సీడీపీఓ భాగ్యలక్ష్మి

పరకాల : రాష్ట్ర ప్రభుత్వం, మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి జాతీయ నూతన విద్యా విధానం 2020 ప్రకారం 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందించనున్నట్లు ఐసీడీఎస్ పరకాల సీడీపీఓ భాగ్యలక్ష్మి తెలిపారు. నూతన పాఠ్యప్రణాళిక తయారు చేసి అంగన్‌వాడీ సెంటర్ లను పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా తయారు చేసేందుకు ఐడీసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. 228 మంది అంగన్‌వాడీ ఉపాధ్యాయు లను ఏడు గ్రూపులు చేయగా 3వ బ్యాచ్ శిక్షణ కార్య క్రమాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో సూపర్‌వైజర్లు పద్మావతి, పద్మావతి, పుణ్యా వతి, రోజారాణి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణపొందిన అంగన్‌వాడీలతో ఐసీడీఎస్ అధికారులు

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

వేలేరు : రైతులకు పెట్టుబడి సాయంగా ఇచ్చే రైతు భరోసా నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడు దల చేయాలని బీఆర్ఎస్ మండల యూత్ అధ్య క్షుడు గోవింద సురేష్ కోరారు. బుధవారం మం డల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జూన్ మొదటి వారంలో రైతులకు ఇవాల్సిన రైతు భరోసా సాయం ఇప్పటికీ అందించలేదని ఆరోపిం చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులు పంట పెట్టుబడులకు ఇబ్బం దులు పడకూడదనే విత్తనాలు నాటే సమయంలోనే రైతుబంధు ఇచ్చేవారని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు లకు కష్టాలు మొదలయ్యాయని ఆరోపించారు.

అంతర పంటల సాగుతో అధిక లాభాలు

- బీసీఐ ప్రాజెక్టు మేనేజర్ మహేందర్

ఎల్కతుర్తి : రైతుల సాగుచేసే ప్రధాన పంటల్లో అం తర పంటలు సాగుచేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని బీసీఐ ప్రాజెక్టు మేనేజర్ మహేందర్ అన్నారు. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ బీసీఐ నవక్రాంతి రైతు ఉత్పత్తి దారుల సంస్థ ఆధ్వర్యంలో రీజనరేటివ్ అగ్రికల్చర్‌లో భాగంగా బుధవారం మండలంలోని చింతలపల్లిలో నవధాన్యాలతో సేంద్రియ ఎరువు లు తయారీ విధానంలో మెళకువలను రైతులకు వివరించారు. ఓ రైతుకు చెందిన పొలంలో నెల రోజుల క్రితం నవధాన్యాలు చల్లడంతో ఏపుగా పెరిగిన మొక్కలను నేలలో కలియదున్నాలని, నవ ధాన్యాల మొక్కలతో పచ్చిరొట్ట తయారు చేసే విధానాన్ని వివరించారు. పప్పుదినుసు విత్తనాలతో పచ్చిరొట్ట ఎరువు తయారు చేసుకోవడం వలన భూసారం పెరిగి నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరు గుతందని, పోషకాలస్థాయి పెరిగి రైతులకు పెట్టు బడి ఖర్చు తగ్గి, అధికంగా పంట దిగుబడులు వస్తా యన్నారు. పచ్చిరొట్టతో ఎరువుల తయారీ పర్యావ రణానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. పత్తితో పాటు ఇతర ప్రధాన పంటల్లో పెసరు, కందిని అం తర్‌పంటలుగా సాగుచేయడం వలన రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. బీసీఐ క్షేత్ర సిబ్బంది లత, రఘు, మోహన్, రమేశ్, శ్రీనివాస్, రాజేందర్, మౌనిక, సౌజన్య, రాకేశ్ పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న మహేందర్

సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం



ధర్మసాగర్ : నిరసన తెలుపుతున్న నాయకులు



ఎల్కతుర్తి : ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



శాయంపేటలో..

ధర్మసాగర్ : సామాన్యులు మూడుపూటలు భోజనం చేసేందుకు భయపడే విధంగా పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించడంలో కేం ద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ మండిపడ్డారు. మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లా డుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిత్యావసర ధరలు, కూరగాయల ధర లు పెంచి సామాన్యుల నడ్డీ విరుస్తోందని అన్నారు. పేదల సంక్షేమం దిశగా పనిచేస్తామన్న బీజేపీ పేదలపై నిత్యావసర ధరల పేరుతో పెను భారం మోపిందని ఆరోపించారు. నిత్యావసర ధరలను నియంత్రించాలని, లేనిపక్షంలో ఆం దోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు మునిగాల భిక్ష పతి, మండల కార్యదర్శి కొట్టె వెంకటేష్, మర్రిపెల్లి అంకూస్, చిలుక బాబు, గోకల రాజయ్య, కొయ్యడ కుమార్, ఎండి పాషా, సునీల్, గట్టయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : నిత్యవసర సరుకుల ధరలు తగ్గిం చాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్య దర్శి ఉట్కూరి రాములు మాట్లాడుతూ.. కూర గాయలు, పప్పులు, నూనె ఇతర నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు నియంత్రించడం లో కేంద్ర ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రె లక్ష్మణ్, మండల కార్యవర్గ సభ్యులు తంగ మొండయ్య, నిమ్మల మనోహర్, మర్రి విజయ్, అంబాల స్వామి, సూర మొగిళి, మేకల విజయ, సావిత్రి, రాధిక, రాజిరెడ్డి, తిరుపతి, సంజీవ్ పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : నిత్యవసర సరుకుల ధరల నియం త్రణ కోసం ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అన్నారు. నిత్యవసర ధరల పెరుగుదలను నిరసిస్తూ మండల కేంద్రం లోని బస్టాండ్ సెంటర్‌లో బుధవారం సీపీఐ మం డల అధ్యక్షుడు బత్తిని సదానందం ఆధ్వర్యంలో గుడిసెవాసులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం భిక్షపతి మాట్లాడుతూ.. నిత్యావసర ధరలు తగ్గించడంలో బీజేపీ ప్రభుత్వం విఫల మైందన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సుభాషిణికి అందించారు. ధరలు తగ్గించని పక్షంలో ఆందోళ ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకు లు ఎండి ఉస్మాన్, అనుకారి అశోక్, రవి, భిక్షపతి, రమేశ్, కుమార్, సుగుణ, సునిత పాల్గొన్నారు.

సఖి సేవలు వినియోగించుకోవాలి



సఖి సేవలపై అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి, వినీల

ఐనవోలు : సఖి-వన్‌స్టాప్ సెంటర్ సేవలను మహి ళలు వినియోగించుకోవాలని లీగల్ కౌన్సిలర్ ఏ శ్రీదేవి, కేస్ వర్కర్ వినీల అన్నారు. మండల కేం ద్రంలోని కేజీబీవీలో బుధవారం సఖి-వన్ స్టాప్ సెంటర్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ కొనసాగుతుం దన్నారు. సఖి సెంటర్‌లో విడిపోయే భార్యాభర్త లకు కౌన్సెలింగ్, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, గర్భవిచ్ఛిత్తి తదితరాల వేధింపులకు సంబంధించిన అంశాలకు పరిష్కారాలు లభిస్తాయ న్నారు. మహిళలు చట్టాలను ఎలా వినియోగించు కోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఇన్‌చార్జ్ ఎస్ఓ సత్యవాణి, స్వప్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీని అమలు చేస్తున్న మోదీ

ఖిలా వరంగల్: మోదీ ప్రభుత్వం దేశంలో అప్రక టిత ఎమర్జెన్సీని అమలు చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నేత శ్రీనివాస్, బండి కోటేశ్వరరావు, గుంగుల దయాకర్ ఆరోపించారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని విద్యానగర్‌లో రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అప్పుడు తమ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని ఇందిరాగాంధీ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ పెడితే, ఇప్పుడు హిం దూత్వ బ్రాహ్మణీయ ఫాసిజాన్ని మోదీ ప్రభుత్వం అమలు చేస్తూ భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు పూనుకున్నదని అన్నారు. సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, జక్కుల తిరుపతి, గట్టి కృష్ణ, గంధ్రతి హరిబాబు, ఇనుముల కృష్ణ, రంజిత, అక్బర్, అమర్ తదితరు లు పాల్గొన్నారు.

'నీట్'పై స్పందించకపోవడం దుర్మార్గం

హన్మకొండ: వైద్య, విద్య ప్రవేశ పరీక్ష నీట్‌లో జరిగిన అక్రమాలపై ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటి వరకూ స్పందించకపోవడం దుర్మార్గమని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) హను మకొండ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి విమర్శిం చారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీలను నిరసిస్తూ డీవై ఎఫ్ఐ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ అయిందని ధ్వజమెత్తారు. దాంతో దేశంలో 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆశీర్వాదం పొందిన తీన్మార్ మల్లన్న



ధర్మసాగర్ : మండలంలోని కరుణాపురంలో క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బుధవారం ప్రార్థనలు చేశారు. మినిస్ట్రీస్ ఫౌండర్ ప్రవక్త డాక్టర్ సంగాల పాల్సన్ రాజ్, సొసైటీ జనరల్ సెకరటరీ డాక్టర్ జయప్రకాశ్ గోపు ఆయనను ఆశీర్వదించారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. ఆసియా ఖండంలో అతిపెద్ద చర్చి కరుణాపురంలో నిర్మించడం చాలా సంతోషకర మని అన్నారు. మందిరానికి అవసరమైన సహ కారం అందిస్తానని అన్నారు. సంగాల యిర్మియా, సునీల్, రవిపాల్ పాల్గొన్నారు.

బస్ షెల్టర్‌ను వెంటనే నిర్మించాలి

ఎల్కతుర్తి : మండలంలోని మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ బొంకూరి రాజు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. విద్యార్థులు ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు, పాలకులు పట్టించుకుని పాఠశాల సమీపంలో గల ఎల్కతుర్తి టూ ముల్కనూరు వద్ద బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరారు.

పాఠశాలల బంద్

విద్యారణ్యపురి: ప్రైవేట్ పాఠశాలల్లోని అధిక ఫీజుల నియంత్రించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్లతో ఏబీవీపీ ఇచ్చిన విద్యాసంస్థల బంద్ పిలుపుతో హనుమకొండలోని పాఠశాలలను బుధవారం బంద్ చేశారు. అక్కడక్కడ తెరిచి ఉన్న ప్రైవేట్ పాఠశాలలను నాయకులు మూసివేయించారు.